# లవ్ లీల



డాక్టర్ సాయి రమేష్ గంధం

ఆనంద నిలయం ముందు ఆగి ఆ యింటిపైపే దీక్షగా చూస్తూ నిలబడ్డాడు, రాజ్ అని ముద్దుగా పిలవబడే అసలు పేరుగల రాజేష్.
'ఆ నిలయంలో ఆశ్రయం దొరకటం కష్టం .. అలాంటి ఆశలు పెట్టుకోవద్దు' అని హెచ్చరించాడు రవి అంతకు ముందు రోజే. అయినా సరే ఆ నిలయంలో ఓ గది అద్దెకు సంపాదించాలన్న పట్టుదల కలిగింది రాజ్ కి. దానికి కారణాలు రెండు. ఒకటి ఆ యింటి ప్రశాంత వాతావరణం. రెండోది ఆ యింటికి మెడికల్ కాలేజ్, సిటీ, బీచ్ యిలాంటి నిత్యావసరాలు తీర్చేవన్నీ దగ్గర్లో వుండటం.
మొట్ట మొదట ఆ వీధిలో ఒక చిన్న రూమ్ దొరికితే బాగుండునని వేటకు బయలుదేరాడు. ఆ వీధివాడే కదా తోడుగా ఉంటాడని రవిని సహాయం అడిగాడు. 'ఈ అఫీషియల్ కాలనీలో రూమ్ కాదుకదా కనీసం రేకుల షెడ్ దొరకడమైనా దుర్లభమే. కాని నువ్వేమో ఆప్తమిత్రుడివి అయితివాయె. చూస్తూ చూస్తూ గాలికి వదిలేయడం భావ్యం కాదు కాబట్టి నా శాయశక్తులా ప్రయత్నించి తమకి ఓ చిన్న రూమ్ దొరికే ఏర్పాటు చేస్తాను' అన్నాడు రవి
'నీ మేలు ఈ జన్మలో మర్చిపోను మిత్రమా... ఆ పని చేసి పుణ్యం కట్టుకో' అన్నాడు రాజ్. అదంతా జరిగి వారం రోజులు అయ్యింది. రవి ప్రయత్నిస్తూనే వున్నాడుగాని రూమ్ మాత్రం దొరకలేదు. ఆ క్రిందటి రోజే మిత్రులు యిద్దరూ కలిసి మరో రౌండ్ వేయడానికి బయలుదేరారు. సాయంత్రం అయిదు గంటలు అవుతోంది. యూనివర్సిటీ నుంచి ఇళ్ళకు వస్తున్నారు ఓ యిద్దరు అమ్మాయిలు అప్పుడే బస్సు దిగి మిత్రులకు ఎదురయ్యారు.
"మా ముంతాజ్ వస్తోంది. ఓ నిముషం ఆగు" అన్నాడు రవి హడావిడిగా రుమాలు తీసి ముఖం తుడుచుకుంటూ, అందులో మిత్రుడు చెప్తున్న ముంతాజ్ ఎవరో పోల్చుకోవడం కష్టమే అయ్యింది రాజ్ కి. ఆ యిద్దరమ్మాయిలూ ఒకరిని మించి ఒకరు అందచందాలతో పోటీపడున్నారు. అందులో ఎవర్ని ముంతాజ్అంటే బాగుంటుందో ఎవర్ని హేమమాలిని అంటే బాగుంటుందో తేల్చిచెప్పడం కష్టమే మరి అందులో చూసి చూడగానే, ఆ భామలు యిద్దరూ దగ్గరకు రావటం వీళ్ళవైపు తలెత్తి అయినా చూడకుండానే దాటి వెళ్ళిపోవటం

అంతా జరిగిపోయింది. రవి మాత్రం వెనక్కు తిరిగి వాళ్ళు వెళ్తున్నవైపే చూస్తూ వుండిపోయాడు.

“మిత్రమా నీ తపశ్శక్తికి మెచ్చి అమ్మాయిలు చూపైనా తిప్పకుండా పోయారుకాని…ఇక నువ్వు వెనక్కు తిరగొచ్చు…” అన్నాడు రాజ్.

“వుండరాబాబు…ఈ ఛాన్స్ తప్పిందంటే మళ్ళీ రేపు సాయంత్రం వరకూ కనిపించదు” అంటూ ఆ అమ్మాయిలు కనుమరుగయ్యేవరకూ చూస్తూనే వున్నాడు రవి.

"నీ మూగ ప్రేమని కాసేపు పెండింగ్ లో వుంచుకానీ… ఇంతకి అందులో ముంతాజ్ ఎవరట?"

“ఆ మాత్రం పోల్చలేదట్రా., షోరూమ్ లో బొమ్మలా ధగ ధగా మెరిసిపోతుంటేను..”

“మిత్రమా నీకు ఒక్కబొమ్మే కనిపించిందేమో కాని నాకు మాత్రం రెండు బొమ్మలు కనిపించాయి మరి ..”

“కొత్తలో నాకు కూడా నీలాగే రెండు బొమ్మలు కనిపిస్తుండేవి. చూడగా చూడగా చూపు తగ్గి ఒక బొమ్మ కనిపించడం మొదలయ్యింది ..”

“పొరపాటు … ఒక బొమ్మ కనిపించడం మానేసింది అను..”

“'యు ఆర్ కరెక్ట్… అప్పటి నుంచీ రెండో బొమ్మ విషయం అట్టే పట్టించుకోవటం లేదు..”

“కానీ నేనింకా ఎర్లీ స్టేజస్ లో వున్నాను  అంచేత ఆ రెండో బొమ్మని కూడా పట్టించుకోవాల్సి వుంటుంది.. అదీ కాక మీ ముంతాజ్ ఎవరో తెలియకపోతే మొత్తానికే మోసం రావొచ్చు … ఏమంటావ్ ..?”

“రాజ్ … నీకు పుణ్యం వుంటుంది కాని అంత పని మాత్రం చెయ్యకు .. చచ్చి నీ కడుపున పుడ్తాను ..”

“మిత్రమా చచ్చాక నువ్వు పుడ్తావో లేదో నాకు తెలీదు కాని .. నీకు అంతగా ఋణం తీర్చుకోవాలని వుంటే వెంటనే ఓ రూమ్ చూసి పెట్టెయ్ ..”

“ఓ.కె … గ్రాంటెడ్ ..”

“యింతకీ బొమ్మల సంగతి చెప్పలేదు ..”

“చెప్తాను నడు .. నడు”

“ఆటా యిటా” అమ్మాయిలు వెళ్ళినవైపు చూపెడ్తూ అడిగాడు రాజ్.

“అటు ఎందుకు రాజ్ ... పనిలేదా..”

“ఆహా నీ మనసుతోబాటు నీ మూడ్ కూడా ఆ ముంతాజ్ వెంట పడి పోయిందోమోనని"

“నిజమే రాజ్ మనసు ఎప్పుడో ముంతాజ్ కి అంకితం అయిపోయింది .. ఇక మూడ్ మాత్రమే మిగిలింది .. దీన్ని వదిలి పెట్టి ముంతాజ్ దగ్గరికి వెళ్ళిపోదామంటే దీని దుంపతెగ ఇది నన్ను వదిలి చావటం లేదు”

“చూడు మిత్రమా... తగు పాళ్ళలో ప్రేమిస్తే ఫర్వాలేదు కాని ఘాటు ఎక్కువైతే ప్రమాదం”

“ఏ ... ఏ రోమియోనో అయ్యి కూర్చుంటానని భయపడుతున్నావా..”

“అంత బెంగ లేదులే ..”

“మరి...”

“ఏమీ లేదు ఆ ముంతాజ్ కనిపించినప్పుడల్లా కళ్ళు తిరిగి పడిపోతావేమోనని ...”

“వేసెయ్ రాజ్ .. వేసెయ్ .. నువ్వు ఇప్పుడు ఎన్ని జోకులు వేసినా భరించాల్సిందే ... తీరా ప్రేమించాక తప్పుతుందా మరి... ఒక నాటికి నువ్వుకూడా ఏ ప్రేమలోనో పడకపోతావా అప్పుడు దీని స్పిరిట్ తెలీక పోతుందా .. నేను చూడకుండా వుండనుగా అప్పుడు చెప్తాను నీ పని .. నాకు వచ్చునయ్యా జోకులు వెయ్యడం మర్చిపోమోక ..”

“వూరికినే మిత్రమా ఏదో తమాషాకి అన్నాను అంతే టేకిట్ ఈజీ” అన్నాడు రాజ్.

“యిందాకటి బ్యూటీ క్వీన్స్ లో ముంతాజ్ ఎవరు అనికదూ నీ డౌట్ .. అయితే విను ..” చెప్పటం ప్రారంభించాడు రవి.

“నాజూకుగా... తెల్లగా వుంది చూశావూ... ఆ అమ్మాయి .. నవ్వుతుంటే బుగ్గలు సొట్టలు పడుతున్నాయి చూడలేదా నువ్వు ..”

“చూశాను ... షి ఈజ్ రియల్లీ మార్వలెస్ ... అయితే ఆ అమ్మాయితో నీకు పరిచయం లేదా ..”

“ముఖ పరిచయముందనుకో..”

“ఎంతైనా...ఒక వీధివాళ్ళే కదా..”

“అది కూడా...ఒకటి రెండు సార్లు హలో..హలో అనుకోవడంతో ఆగిపోయింది..”

“కంగారుపడకు మిత్రమా... అదే పెరుగుతుంది ..”

“ఇంకా చాలా విషయాలు చెప్పాలి .. బీచ్ కి వెళ్ళి తీరుబడిగా మాట్లాడుకుందాం నడు ..”

“మరి నా రూమ్ సంగతి ..”

“చూసిపెట్టే బాధ్యత నాది .. ఓ. కెన”

‘వీల్లేదు యిప్పుడే రూమ్ కోసం అన్వేషణ ప్రారంబిద్దాం' అనలేకపోయాడు రాజేష్

“ముంతాజ్ అసలు పేరు మాధురి .. ఆనందనిలయానికి ఏకైక వారసురాలు ..”

“అంతే కాదు .. బహుశా ఆమెకు తల్లిగారు వుండి వుండరు ..”

“నీకెలా తెలిసిందిరా..” అన్నాడు రవి ఆశ్చర్యంగా

“జస్ట్ వూహించాను .. నువ్వు ఆ అమ్మాయిని పరిచయం చెయ్యడానికి అంత ఎంఫసిస్ ఇస్తుంటే ఏమనుకోవాలి చెప్పు .. మన తెలుగు కథల్లోలా మీ హీరోయిన్ కూడా పుట్టగానే, లేక ఆ తరువాత కొంత కాలానికో తల్లి గారిని పోగొట్టుకుని వుంటుందనీ, తండ్రిగారి పెంపకంలో సుకుమారంగా, గారాబంగా ముద్దూ ముచ్చటలన్నీ తీర్చుకుంటూ పెరిగివుంటుందనీ, అంచేత కాస్త పెంకిఘటంకూడా అయ్యి వుంటుందనీ...”

“ప్లీజ్ స్టాప్ యిట్ .. నువ్వేమన్నా అనుకొని, మా ముంతాజ్ ని మాత్రం పెంకి పిల్ల అంటే వొప్పుకోను. కాస్త చలాకీగా తిరిగినంత మాత్రాన అల్లరి పిల్ల అయిపోతుందంటావా?”

“'నా ఉద్దేశ్యం అదికాదు సార్ ..”

“సరె సరే ఏదో ఒకటి .. ముందు అసలు విషయం చెప్పనీ... ఆనంద నిలయానికి ఏకచ్ఛత్రాధిపతులు రాజగోపాలరావుగారు .. రిటైర్డు జడ్జి .. ఎంతో హుందాగా చురుకుగా వుంటారు .. సరదాగా మాట్లాడతారు .. నిజానికి చాలా మంచి మనిషిరా నువ్వు ఊహించినట్లు మాధురిని చాలా గారాబంగా పెంచుకువచ్చారు .. దానికి కారణం ఆ అమ్మాయికి చిన్నప్పుడే తల్లి పోవటం కాదు...”

“మరి ..”

"వాళ్ళకి ఒక్కత్తే సంతానం కావటమే”

“అయితే తల్లి బ్రతికే వుందన్నమాట”

“లేదు. రెండు సంవత్సరాల క్రితమే ఆవిడ చనిపోయింది..”

"అయామ్ సారీ. అయితే అంత పెద్ద ఆనంద నిలయంలో తండ్రీ కూతుళ్ళు ఇద్దరే వుంటున్నారా? చక్కగా నాలాంటి వాడికి ఓ రూమ్ అద్దెకు ఇచ్చి పుణ్యం కట్టుకోవచ్చుగా?"

మళ్ళీ ఒకసారి తన రూమ్ సంగతి గుర్తు చేశాడు రాజ్

"ఆ విషయంలో మాత్రం జడ్జిగారు ఎలాంటి పాపం చేయలేదనే చెప్పాలి .. ఎందుకంటే యిల్లంతా పూర్తిగా జడ్జిగారి ఆధీనంలోనే వుంటే శ్రేయస్కరంకనుక.." తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్నాడు రవి.

"యిద్దరు మనుషులికి అంత పెద్ద భవనం అనవసరం అనుకుంటాను .."

"అలా అనుకుని వుండరు ఆయన .. లేకపోతే క్రింద భాగంలో  కొంత అద్దెకు ఇచ్చి వుండేవారు .. అదీ కాకుండా జడ్జిగారు ఆస్తిపాస్తులు బాగా వున్న పెద్ద మనిషి .. ఎంత రిటైరు అయిపోయినా కాస్త డిగ్నిటీ మెయింటెన్ చెయ్యాలి కదా.. ఒక ప్రక్క పెళ్ళికి ఎదిగిన కూతురు కూడా వుందాయె .. మంచి సంబంధాలు రావాలంటే హంగులతో కాస్త హుందాగా కనిపించాలనుకుంటాను .."

"నిజమే అనుకో.. అయినా ఏముంది, రూమ్ ఇస్తే ఇంట్లో మనిషిలా ఎడ్జస్ట్ అయిపోతాం.."

"ఇంకా నయం ఇంట్లో మనిషి అయిపోతానన్నావు కాదు.."

రాజ్ చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"పొరపాటున కూడా నీలాంటి బ్రహ్మచారులికి ఇల్లు అద్దెకివ్వరు ఆయన.. ఒకవేళ ఇచ్చినా ఇంట్లోకి మాత్రం పర్మిషన్ లేనిదే రానివ్వరు .. అమ్మా.. కూతురి విషయంలో మాత్రం జడ్జిగారు చాలా స్ట్రిక్ట్ గా వుంటున్నారు రాజ్ .."

"ఆయన గురించి నాకు తెలీదు కాని, నువ్వు మాత్రం మీ ముంతాజ్ విషయంలో చాలా క్రమశిక్షణ పాటిస్తున్నావనిపిస్తుంది .."

రవి మురిసిపోయాడు..

"ముందు చాలా పెద్ద లాన్ వుంది చూశావుగా.. సాయంత్రం ఐదింటికల్లా వనం లోకి వచ్చి కూర్చుంటారు జడ్జి గారు .. బహుశా వైజాగ్ లో ఈ కాలంలో ఏ కొద్ది మందికో అంత విశాలమైన లాన్ వుందనుకుంటాను .. చాలా బాగా మెయింటేన్ చేస్తున్నారులే.."

“అంతేలే కూతురినే అంత బాగా పెంచుకువస్తున్న ఆయన,వనదేవతని పట్టించుకోకపోతే ఆశ్చర్యపడాలికాని నీళ్ళుపోసి నీట్ గా వుంచుతున్నారంటే ఆశ్చర్యపడాల్సిందేముంటుంది ..” అన్నాడు రాజ్

“అయితే లాన్ గురించి ప్రస్తావన ఎందుకు వచ్చిందంటే మా ముంతాజ్ కూడా ప్రతి సాయంత్రం వాళ్ళ డాడీతో పాటు లాన్లోకి వచ్చి కూర్చుంటుంది .. ఇద్దరూ కలిసి ఏ చెస్సో ఆడుకోటమో లేకపోతే ఆయన గారు ఏ పేపరో చదువుకుంటూ కూర్చుంటే ఈవిడగారు ఏదో గార్డెన్ వర్క్ చేస్తూ ఒక వనదేవతలా తిరుగుతూ వుండటమో సాధారణంగా జరిగే విషయం. రోడ్డు మీద అటు ప్రక్కగా వెళ్ళే వాళ్ళకి అదొక అద్భుత దృశ్యం అనుకో..”

“అందరికీ అనకు .. వెళ్ళే వాళ్ళందరు అటు చూడరు .. ఒకవేళ చూసినా అందరికీ ఆ దృశ్యం కనిపించదు ... ఎందుకంటే గోడ ప్రక్కగా పెద్ద పెద్ద క్రోటన్స్ చెట్లు చాలా వున్నాయి. ఆగి ప్రత్యేకంగా కొంత సేపు చూస్తే తప్పించి లాన్లో ఎవరున్నది కనిపించరు .. ప్రేమ ద్రుష్టితో చూసే ఒక్క నీకు తప్పించి ..”

“అయితే చివరిగా ముంతాజ్ గురించి మరో రెండు ముక్కలు చెప్పి కథని ప్రస్తుతానికి ముగిస్తాను" అన్నాడు రవి.

'యూనివర్సిటీలో ఎమ్.ఏ.ఇంగ్లీషు చేస్తోంది. ఇప్పటి వరకూ తగిన వరుడు దొరకలేదని వినికిడి. దట్సాల్.....

“అంతా బాగానే వుంది కాని... రెండో భామని గురించి కూడా ఓ రెండు ముక్కలు చేప్పేస్తే కథకి ఎఫెక్ట్ వస్తుందేమో ..” అన్నాడు రాజ్.

“పెద్దగా చెప్పటానికి ఏమీ లేదు .. ఇద్దరూ క్లాస్ మేట్స్... ఆ అమ్మాయి కూడా ఇంగ్లీషు లిటరేచర్ చేస్తోంది ... పేరు హేమ మైనస్ మాలిని..” అంటూ ముగించాడు రవి ఆరోజుకి తన ఆ ప్రేమ గోల పురాణం .

***

కొన్ని క్షణాలవరకూ తన దృష్టిని మరల్చుకోలేక పోయాడు రాజ్. కేవలం అందమైన అమ్మాయి వుందని కాదు, ఓ అందమైన లాన్ మరింత చక్కగా వున్న ఇల్లు చూసి ఆ ఇంట్లో ఒక గది అద్దెకు దక్కించుకుని ఆ సంవత్సరమంతా నిశ్చింతగా సుఖంగా

గడపాలని వుంది అతనికి. అది జరిగేపని కాదన్న అనుమానం లేకపోలేదు. అయినా ప్రయత్నించటంలో తప్పులేదని అంతవరకూ వచ్చాడు.

వచ్చే ముందు రవిని తోడుగా రమ్మందామనుకున్నాడు. కాని అతడు అందుకు వప్పుకోడని తెలిసి చెప్పలేదు.

టైమ్ చూసుకున్నాడు. అయిదున్నరయ్యింది.

గేటు దగ్గరకు వెళ్ళాడు. కుక్కలున్నాయి జాగ్రత్త అన్న బోర్డు చూసి కాస్త వెనక్కు తగ్గాడు, ఆలోచనలో పడ్డాడు, లోపలికి వెళ్ళాలా వద్దా అని . ఏదో ఒకటి తేల్చుకునే లోపల తోటమాలి వచ్చి "ఎవరు కావాలి బాబు .." అని అడుగుతూ సంశయిస్తున్న రాజ్ కి అవకాశం కల్పించాడు

"మీ అయ్యగారు .." అన్నాడు ఠక్కున.

"ఎవురొచ్చేరని సెప్పమంటారండ .."

"ఆయన లోపల వున్నారా బయట కూర్చున్నారా" అని అడిగాడు రాజ్ .

"అల్లదిగోటి... తోటలో కూర్సున్నారు కదండ .."

"అయితే నన్ను అక్కడికి తీసుకు వెళ్ళు .. ఆయనతో కాస్త మాట్లాడాలి"

తోటమాలి గేటు తలుపు తీశాడు.

"మీ యింట్లో కుక్కలు చాలా వున్నాయనుకుంటాను" అన్నాడు లోపలికి నడుస్తూ

"అబ్బో సాలావుండేయండ యిప్పుడయన్నీ సచ్చిపోయినాయి కదండా.."

"అయితే గేటుకి ఆ బోర్డు యింకా తగిలించి వుంచారెందుకు..."

"అదాండా మరేమో ఎవరుపడితే ఆరు లోనకి వచ్చియ్యకుండా వుంటారని మా అయ్యగారే దాన్ని వుంచియ్యమన్నారండ .."

జడ్జిగారి తెలివిని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు రాజ్.

"నమస్కారమండి .."

"నమస్కారం .." చదువుతున్న పేపరులోంచి తల పైకెత్తి చూశారు. ఎదుట నిలబడిన వ్యక్తి ఎవరో ఆగంతకుడు కావడంతో కాస్త కంగారు కనిపించింది ఆయన ముఖంలో "ఏం బాబు.. ఎవరు కావాలి"

"మీ కోసమే వచ్చానండీ ... కొంచెం మాట్లాడదామని.." అన్నాడు సవినయంగా

"అలాగా.. కూర్చో.." అన్నారు చనువుగా,

రవి అన్నట్లు చాలా మర్యాదస్తుడేసుమా అనుకున్నాడు రాజ్ మనసులో. కూర్చున్నాడు అణకువగా. చుట్టూ ఒక్కసారి కలియచూశాడు. ఆ దరిదాపుల్లో ఎక్కడా కనిపించలేదు జడ్జిగారి అమ్మాయి.

ఏమిటన్నట్లు గోపాలరావుగారు ప్రశ్నార్ధకంగా చూశారు అతనివైపు.

చిన్నగా గొంతు సవరించుకుని "నా పేరు రాజేష్ అండి. హౌస్ సర్జన్సీ చేస్తున్నాను" అన్నాడు పరిచయ పూర్వకంగా,

"చాలా సంతోషం .."

"ఈ కాలనీలో ఏదైనా చిన్న రూమ్ దొరుకుతుందేమోనని వెదుకుతున్నానండి" అన్నాడు అతి నెమ్మదిగా

"నేనో .. ఈ కాలనీలో రూమ్ దొరకటమంటే చాలా కష్టమయ్యా .. అయినా మీకు సెపరేట్ గా క్వార్టర్స్ వున్నాయనుకుంటాను .. వేరే రూమ్ దేనికి" అడిగారు ఆయన అనుమానం వ్యక్తపరుస్తూ

"క్వార్టర్స్ లో ఏమీ బాగుండటం లేదండీ ఈ మధ్య .. నా చదువుకి చాలా ఆటంకంగా కూడా వుంది .."

"హౌస్ సర్జన్సీలోకి వచ్చాక కూడా చదువేమిటయ్యా .."

యు.ఎస్.ఎం.ఎల్ పరీక్షలకి ప్రిపేర్ అవుతున్నానండి .. మీకు తెలియంది ఏముంది ఈ కాలం కుర్రాళ్ళు ఎంత విచ్చలవిడిగా తిరుగుతున్న న్నా అంత కంటే ఎక్కువ వెస్ట్రనైజ్ అయిపోయి బిహేవ్ చేస్తున్నారు .. చదువుకి ఆటంకం రాకుండా కాస్త దూరంగా వుందామని  ముందు జాగ్రత్త పడుతున్నాను .. అంతకంటే ఏమీలేదు సార్ .."

"అర్ధమయ్యింది .. అర్ధమయ్యింది .. కానీ ఈ కాలనీలో అందులో ఈ రోజుల్లో మీకు రూమ్ దొరకటం అంత తేలికకాదు .."

"మీరేమీ అనుకోకపోతే నాదో చిన్న రిక్వెస్ట్ అండి .." అసలు విషయం చెప్పేయటం మంచిదనుకున్నాడు

“ఏమిటది ..” అన్నారు కాస్త యిబ్బందిగా ముఖం పెట్టి.
“అబ్బే పెద్దగా ఏమీ లేదండి .. మీ యింట్లో ఏదైనా చిన్న రూమ్ .. మేడ పైనైనా  కిందైన ఎక్కడైన సరే అడ్జస్ట్ ఐపోతాను .. వుంటే యిప్పిస్తారేమోనని” అన్నాడు సందేహిస్తూ, చివరి ముక్కలు మింగేస్తూ ,తడబాటు కప్పిపుచ్చుకుంటూ.
“మా యింట్లోనా ..” గంభీరమైన నవ్వుతో  “అబ్బే అద్దెకివ్వాల్సిన అవసరం ఎప్పుడు రాలేదయ్య ..  ఒకవేళ యివ్వాలనుకున్నా అంత అద్దె నువ్వు ఇచ్చుకోగలవా.. నీ స్టయిఫండ్ అంతా దానికి సరిపోతుంది ..” అన్నారు ఛలోక్తిగా
యిక మాట్లాడటం బాగుండదని తెలిసి కూడా “చిన్న రూమ్ వుంటే సరిపోతుంది" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో
“నోనో ..  మేము వుండటానికి మాత్రమే యిల్లంతా ..  యిప్పటివరకూ ఎవరికీ అద్దెకు ఇవ్వలేదు .. ఇకమీదట ఇవ్వాలన్న ఆలోచన కూడా లేదు ..”
ఇంకోమాట పొడిగించి ఆయన్ని విసిగించటం మర్యాదగా వుండదనిపించింది రాజ్ కి.
“మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు మన్నించాలి .. శెలవు తీసుకుంటాను మరి” అంటూ కుర్చీలోంచి లేచాడు.
“నెవర్‌మైండ్ .. అర్జెంట్ వర్క్ ఏమీ లేకపోతే ప్లై డోంట్ యు సిట్ ఫర్ ఎ వైల్ ..” అన్నారు ఆయన.
కాస్త ఆశాజనకంగా వున్నాయి ఆయన మాటలు అతనికి. వెంటనే వెళ్ళే ప్రయత్నం విరమించుకున్నాడు రాజ్.
కొంతసేపు అతని గురించి వివరాలు అడగడంతో గడిచిపోయింది. మరికొంత సేపు డ్రింకులు తెప్పించి అతిథి సత్కారాలు చేయటంతో గడిచిపోయింది. “అయామ్ వెరీ గ్రేట్ ఫుల్ ఫర్ యువర్ హాస్పిటాలిటీ” అన్నాడు రాజ్. దిసీజ్ ది లీస్ట్ వుయ్ కుడ్ డు ఎంగ్ మేన్ చిన్నగా నవ్వారు - “అదుగో మా అమ్మాయి కూడా వస్తోంది .. పరిచయం చేస్తాను కూర్చో” అన్నారు.
కాస్త సర్దుకుని కూర్చున్నాడు రాజ్.

“ఇటు రామ్మా.. మీట్ దిస్ నైస్ ఎంగ్ డాక్టర్ రాజేష్ .. మై ఓన్లీ ఛార్మింగ్ డాటర్ మాధురి” అంటూ ఒకరినొకరికి పరిచయం చేశారు.

“నైస్ టు మీట్ యు”

“థాంక్యూ"

“మీరూ హౌసర్జన్సీ చేస్తున్నారా” అని అడిగింది అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

“అవునండి”

“నీకు ఎలా తెలుసమ్మా ?”

“అయ్ కెన్ గెస్ డాడీ .. రవి అంటారు చూడండి అదే డాడీ మీ ఫ్రెండ్ రాజారావుగారి అబ్బాయి”

“ఆ.. ఆ.. ఆ కుర్రవాడు నాకు తెలీకపోడం ఏమిటి.. హౌసర్జన్సీ చేస్తున్నాడు కదా ..”

“ఆ .. అతనే .. ఆయన ఈయన కలిసి వెళుతుంటే చూశాను .. నిన్నో మొన్నో అనుకుంటాను సరిగ్గా గుర్తులేదు ..” అక్కడ యింకో వ్యక్తి వున్నాడన్న సంగతి మర్చిపోయి స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు తండ్రీ కూతుళ్ళు ఇద్దరూ.

“యు ఆర్ కరెక్ట్ .. యిట్ వజ్ యెస్టర్డే ..” కలగజేసుకోకుండా వుండలేకపోయాడు రాజ్.

“రూమ్ కోసమే తిరుగుతున్నామండీ” సమర్థించుకున్నాడు గోపాలరావుగారి వైపు దృష్టి మరలిస్తూ.

“రూమ్ ఎవరికి మీకేనా" రాజ్ సమాధానం చెప్పేలోపల గోపాలరావుగారు కలగజేసుకున్నారు.

“అవునమ్మా అతనికేనట .. క్వార్టర్స్ లో బాగుండటం లేదట మన యింట్లో ఏదైనా రూమ్ ఖాళీగా వుందేమోనని అడగటానికి వచ్చాడు .. పాపం చాలా డిజప్పాయింట్ చేశాను” అన్నారు.

“సారీ అద్దెపేరుతో మీకు యిబ్బంది కలిగించాను " అన్నాడు రాజ్ మొగమోట పడుతూ.

“ఎనీహౌ... నేను కూడా గుర్తుంచుకుంటాను... ఈ దగ్గర్లో ఎక్కడైనా రూమ్ వుందని తెలిస్తే తెలియజేస్తాను... రెండు మూడు రోజులు పోయాక ఒకసారి ఇలా వస్తే సరి...”

“అలాగేనండి... తప్పకుండా వస్తాను...”

“మీ హౌస్ సర్జన్సీ ఎప్పటితో పూర్తవుతుంది” అని అడిగింది మాధురి.

“యింకా ఎనిమిది నెలలు వుందండి...”

“మీకు ఫ్రీ క్వార్టర్స్ అనుకుంటాను” అతడ్ని పరీక్షగా చూస్తోంది ప్రశ్నల వర్షం కురిపిస్తూ అడుగుతూ.

“కాని ఈ మధ్య ఎట్మాస్ఫియర్ అంత బాగుండటం లేదండి..”

“డాక్టరులే అలా అంటే ఎలా” పదునుగా వుంది ఆ మాటల స్వరం .

“డాక్టర్లు కాబట్టే అలా అంటే బాగుంటుందనుకుంటాను..” రాజ్ చిన్న నవ్వు మొకం పెట్టాడు ఆ మాటలంటూ.

“మీ హాస్పిటల్ అంత అసహ్యంగా వుంటుంది కదా మరి దాని గురించి ఒక్క డాక్టరూ బాధపడరే ..” అంది కాస్త వెటకారంగా.

“రోగులున్నచోట అసహ్యంగా వుండకుండా యింకెలా వుంటుందమ్మా .. రోగమంటేనే ఒక రోత మరి ..” అన్నారు గోపాలరావుగారు.

“అదికాదు డాడీ ... ఈ జనరల్ హాస్పిటల్ నిండా కుక్కలు కాకులూను...”

“యిదయ్యా మా అమ్మాయి వరస ... తను సూపరింటెండెంట్ అయివుంటే వార్డులో ఆఖరికి డాక్టర్లని కూడా తిరగనిచ్చేది కాదేమో ..”

"అదికాదు డాడీ .. అసలు హాస్పిటల్ అన్నాక ఎంతో నీటుగా వుండాలి కదా.. అలాంటిది మన హాస్పిటల్ లో కుక్కలు తిరగటమేమిటీ ... అందులోనూ మన ఎకానమీ ప్రపంచంలోనే నాలుగో స్థాయికి చేరేక అబ్బ ఎంత నేస్టీగా వుందో తెలుసా.. అవి వార్డ్స్ లో దర్జాగా రౌండ్స్ వేస్తుంటే ఒక్కరు కూడా పట్టించుకోరు కదా, మరి ఈ డాక్టర్లంతా ఎలా వూరుకుంటున్నారో ఏమిటో.. యింకో ప్రక్కనుంచి కాకులు .. నేను చూస్తుండగా ఈ రెండే కనిపించాయికాని, ఇంకా ఎన్నిరకాల జంతువులు వచ్చిపోతున్నాయో ఏమిటో.. ఆ హాస్పిటల్ మనుషులకా పశువులకా అనిపించింది ..”

“కొంతవరకూ నిజమే అనుకోండి ..” ఆ విమర్శను ఎదిరించడానికి మాటలు వెదుక్కున్నాడు

"దీని గురించి అలోచించటం అనవసరమర్రా .. గవర్నమెంటు హాస్పిటల్ అంటేనే అక్కడ వాతావరణం అలా మారిపోతుంటుంది .."

"అదీకాకుండా ఈ మధ్య హాస్పిటల్ చాలా హారిబుల్ గా వుంటోందిలేండి" అన్నాడు రాజ్.

"మరి మీ డాక్టర్లంతా ఏం చేస్తున్నట్లు..." అంది మాధురి అవేశంగా,

"నా రూమ్ గురించి నేను ఒక్కడ్నే జాగ్రత్తపడితే సరిపోతుంది .. కాని హాస్పిటల్ గురించి నేను ఒక్కడ్నే బాధపడితే సరిపోతుందంటారా .." అన్నాడు రాజ్ సున్నితంగా,

"బాగా చెప్పావు..." మధ్యలో గోపాలరావుగారి మెప్పు.

"పోనీ అదంతా ఏదో పబ్లిక్ ఎఫేర్ అనుకోవచ్చు... మరి మీ డాక్టర్లు కనీసం రోగుల్ని చూసేటప్పుడైనా కాస్త గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలి కదా.."

"తప్పకుండా .. అలా ప్రవర్తించని పక్షంలో ఆ వ్యక్తి డాక్టరు వృత్తికి అర్హత పొందలేదనే చెప్పాలి..."

"కాని ఇప్పుడు మీ డాక్టర్లకి అదే లేదంటున్నాను" అంది మాధురి రోషంగా.

ఆమె ఎందుకంత కోపం తెచ్చుకుంటుందో రాజ్ కి అర్థం కాలేదు.

"మీ అంటే .. నాలో కూడా మీకేమైనా లోపం కనిపించిందా" ఎంతో వినయంగా అడిగాడు.

"మీరంటే మీరు అనికాదు.. యిన్ జనరల్ మాట్లాడ్తున్నాను.."

"ఏమిటమ్మా ఈరోజంతా డాక్టర్లని పట్టుకుని తెగ దులిపేస్తున్నావ్.. సోషల్ మీడియాలోనో పేపర్లోనో ఎక్కడైనా  డాక్టర్ల అఘాయిత్యం అని ఏమైనా ఫ్లేష్ న్యూస్ చూశావా ఏమిటి..."

"అదికాదు డాడీ ... మొన్న మా క్లాస్ మేట్ ఒక అమ్మాయి వంట్లో బాగుండక జనరల్ హాస్పిటల్ కి వెళ్ళింది .. ఓ అసిస్టెంట్ అంట ... పొట్టిగా నల్లగా వున్నాడట ... అంతా ఎగ్జామ్ చేసి ఒకసారి జాకెట్టు విప్పండి అన్నాడట ... పాపం ఎంత ఎంబేరసింగ్ గా వుంటుందో ఆలోచించరా .. అందులో అక్కడ యింకెవ్వరూ లేరటకూడాను .. లాభం లేదు జాకెట్ విప్పితేకానీ పరీక్ష చేయటానికి వీలవ్వదు అన్నాడట .. డామిట్ అదే నేనయితేనా జాకెట్ విప్పితేకాదు నీ చెంప ఛెళ్ళుమంటే అదే వీలవుతుంది అని చెప్పి వుండేదాన్ని... అది అమాయకురాలు కాబట్టి నోర్మూసుకుని వచ్చేసింది .." అంది ఉక్రోషంగా.

లీల మాధురిని చూస్తుంటే నవ్వాలనిపించింది రాజ్ కి. కానీ సభ్యతగా వుండదని నవ్వు ఆపుకున్నాడు.

"బాగుందమ్మా నీ కథ..." అన్నారు గోపాలరావుగారు నవ్వుతూ.

"కథ కాదు డాడీ నిజంగా జరిగింది..."

"నిజంగా జరిగినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదండి.. డాక్టర్లలో అలాంటి వాళ్ళు కొంతమంది వున్నారు. అలా అని అందరు డాక్టర్సు ఒక్కలాంటి వాళ్ళే అనుకోవటం పొరపాటు.."

"నేను అలా అనటం లేదు.."

"మీరు అంటున్నారని కాదు... ఒకోసారి పేషెంట్ సిగ్గూ బిడియం వదిలిపెట్టాల్సి వుంటుంది... ఉదాహరణకి ఒక హార్ట్ డిసీజ్ కేస్ వుందనుకోండి .. తరో ఎగ్జామినేషన్ చేయకుండా పంపించేయటం తప్పే కాదు ప్రాణాని కి కూడా ప్రమాదం కావొచ్చు .. ఆ స్త్రీ ఎలాంటిదైనా జాకెట్టు పూర్తిగా తీసి పరీక్ష చేయాల్సి వుంటుంది .. ఒకవేళ నాలాంటి కుర్రవాడితో అలా ఎగ్జామిన్ చేయించుకోవటం ఇష్టం లేకపోతే  ఏ లేడీ డాక్టర్ దగ్గరకో వెళ్ళటం మంచిది అంతేకాని డాక్టర్ జాకెట్టు విప్పమన్నాడు కాబట్టి వాడు స్త్రీలోలుడు .. దుర్మార్గుడు అనుకుంటే ఎవరూ ఏమీ చేయలేరు .. అలా అని మీ వాదనని నేను కాదనటం లేదు .. ఎందుకంటే ఒకవేళ అంత అవసరం అనుకుంటే చాపెరాన్ గా  ఏ నర్సునో ఎవర్నో పెట్టుకుని డాక్టరు ఆ పనిచెయ్యాలి ... అంతేకాని వంటరిగా వున్న ఏ స్త్రీని జాకెట్టు విప్పమనటం మర్యాదకాదు .. మెడికల్ ఎథిక్స్ రీత్యా అది శిక్షార్హమైన వైద్య నేరం అయ్యేఅవకాశం కూడా వుంది " అన్నాడు రాజ్.

"చూశారా డాడీ .. ఈ డాక్టర్లు ఎంత రబ్బిష్ గా బిహేవ్ చేస్తున్నారో .."

"ఇంకో విషయం .. డాక్టర్లు కూడా అందరిలాంటి మనుషులే... వాళ్ళల్లో కూడా అన్నిరకాల వికారాలు వుంటాయి .. అని మర్చిపోకూడదు .."

"కాని అందరూ అనుకునేది ఏమిటంటే మీ డాక్టర్లంతా దేవుళ్ళని దేవతలని .."

"ఆ వృత్తికి వున్న విలువ అలాంటిది .. అయినా అందరూ దేవతలు కానక్కర్లేదు..."

"ఆ ఉన్నత స్వభావం లేని మనుషులు డాక్టర్లు కావటం దేనికి.."

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Love+Leela+Revised**

* * *